క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణం చేస్తున్న అర్చకులు

గుర్ల: మండల కేంద్రంలోని శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా శనివారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సురేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కనులపండువగా శివపార్వతుల కల్యాణం జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే కోటగండ్రేడులో గ్రామ వైస్ సర్పంచ్ ముద్దాడ దినేష్‌కుమార్ 1111 కొబ్బరికాయాలతో స్వామివారికి పూజలు చేశారు.

ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు


ముసుగు వేసివున్న ఎన్‌టీఆర్ విగ్రహం

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ జంక్షన్ వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నందమూరి తారకరామారావు విగ్రహానికి ఎట్టకేలకు ముసుగు పడింది. ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేయకపోవడంపై సాక్షి పత్రికలో శనివారం ప్రచురితమైన 'ఇది కాదా.. కోడ్ ఉల్లంఘన' వార్తకు అధికారులు స్పందించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేశారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


కల్యాణం జరిపిన ఉత్సవమూర్తులివే..

బాడంగి: మండల కేంద్రంలోని వీరబ్రహ్మంగారి ఆలయంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా గోవిందమ్మ, వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ లావేటి సంతోషాచార్యుల పర్యవేక్షణలో ఆయన శిష్యుడు రామాచారి కల్యాణాన్ని అంగరంగవైభవంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

తెర్లాం: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలకు ముందుగా పొలాల్లో నవధాన్యాలు సాగు చేయడం ద్వారా భూమి సారవంతమవుతుందని ఏపీసీఎం ప్రకృతి వ్యవసాయం పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు అన్నారు. మండలంలోని నందిగాంలో నవధాన్యాల సాగుపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవధాన్యాల సాగుతో రైతుకు అదనపు ఆదాయం సమకూరుతుందని చెప్పారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువులను ఎక్కువగా వాడాలని సూచించారు.

రూ. 40 లక్షలతో మరమ్మతులు


దిబ్బగుడ్డివలస వద్ద అభివృద్ధి చేసిన రోడ్డు

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస నుంచి నారసింహునిపేట వరకు గల ఆర్‌అండ్‌బీ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం రూ. 40 లక్షలు మంజూరు చేసింది. దీంతో అధికారులు మరమ్మతులు చేశారు. మరమ్మతులకు రూ.80 లక్షలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు ప్రతిపాదనలు పంపించగా.. ప్రభుత్వం 40 లక్షల రూపాయలు మంజూరు చేసింది. మరమ్మతులు దాదాపు పూర్తయ్యాయని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

ధాన్యం సేకరణ పూర్తి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రమామణి

రామభద్రపురం: మండలంలోని ఆర్‌బీకేల ద్వారా ధాన్యం పూర్తిస్థాయిలో సేకరించామని ఎంపీడీఓ రమామణి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ వెంకటయ్యతో కలిసి ఆమె మాట్లాడుతూ, మండలంలోని 1176 మంది రైతుల నుంచి 5,862 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ఇప్పటివరకు దాదాపు రూ.8.57 కోట్ల బిల్లులు చెల్లించినట్లు చెప్పారు. గోనెలు, హమాలీల ఖర్చులు కూడా రైతుల ఖాతాలకు జమ చేశామన్నారు.

హరహర మహాదేవ..

- భక్తిశ్రద్ధలతో శివరాత్రి పూజలు
- శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శనివారం వెకువజాము నుంచే ఆలయాల ముందు భక్తులు బారులుతీరి కనిపించారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఆలయ కమిటీలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశాయి.

– సాక్షి నెట్‌వర్క్


చీపురుపల్లి రూరల్: నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పరమేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న భక్తులు


చీపురుపల్లి రూరల్: నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు


గజపతినగరం రూరల్: మరుపల్లి శివాలయంలో నవగ్రహ పూజలు చేస్తున్న భక్తులు


బొండపల్లి: నెలివాడ శివాలయలంలో పూజలు చేస్తున్న భక్తులు


బొండపల్లి: గెద్దపేట శివాలయం వద్ద బారులుతీరిన భక్తులు


జామి: అలమండ రైల్వేస్టేషన్ సమీపంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణం


జామి: జామిలో త్రిపురాంతక స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు


గజపతినగరం: గజపతినగరం శివాలయంలో బారులుతీరిన భక్తులు


గజపతినగరం: శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు


గంట్యాడ: పెదవేమలి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


లక్కవరపుకోట: ఎల్.కోట వీరభద్రస్వామి ఆలయంలో సామూహిక రుద్రాభిషేకాలు


లక్కవరపుకోట: ఎల్.కోటలో అన్నసమారాధన


వేపాడ: బానాది శివాలయంలో అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు


వేపాడ: బొద్దాం శివాలయంలో భక్తుల పూజలు


కొత్తవలస రూరల్: తుమ్మికాపల్లిలో పూజలు అందుకుంటున్న శివయ్య


దత్తిరాజేరు: పాచవలసలో పూజలు చేస్తున్న భక్తులు


దత్తిరాజేరు: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా ఎంపీ బెల్లాన పుట్టినరోజు


కుటుంబ సభ్యులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీ పుట్టినరోజు వేడుల్లో బెల్లాన వంశీకృష్ణ, మండల నాయకులు

చీపురుపల్లిరూరల్: విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్(పెదబాబు) పుట్టినరోజు వేడుకలు పట్టణంలో శనివారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసుల నాయుడు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీ తనయుడు బెల్లాన వంశీకృష్ణ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతలు, రోగులకు, బాపూజీ వృద్ధాశ్రమంలో వృద్ధులు, అనాథలకు పండ్లు, రొట్టిలు పంపిణీ చేశారు. మేజరు పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి ఆధ్వర్యంలో స్థానిక నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద్, ఇప్పిలి తిరుమల, గెరిడి రామదాసు, మంగళగిరి శ్రీను, తాడేల ఉమ, కొసిరెడ్డి రమణ, ముల్లు పైడిరాజు, చిరంజీవి, కరిమజ్జి శ్రీనివాసరావు, అధికార్ల శ్రీనుబాబు, రఘుమండ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కటింగ్

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తన పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. భార్య బెల్లాన శ్రీదేవి, కుమారుడు బెల్లాన వంశీకృష్ణ, కోడలు పావని సమక్షంలో కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. తన పట్ల ఆదరాభిమానాలు చూపిస్తున్న ప్రజలు, అభిమానులు, పార్టీ కార్యకర్తలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

గృహసారథులే గెలుపు రథసారథులు


శింగరాయిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లే రథసారథులని, మీరంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దబ్బిరాజుపేట, శింగరాయి గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు అధ్యక్షతన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, టీడీపీ, ఎల్లోమీడియా తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు. గత ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. గ్రామస్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఏఎంసీ చైర్మన్ ఎం.కస్తూరి, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, మండల జేఎస్‌సీ కన్వీనర్ బోజంకి శ్రీను, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, ఎంపీటీసీలు రాంజీ, టీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

పులకించిన పుణ్యగిరి


పుణ్యగిరి మెట్లు మార్గంలో భక్తులు

శృంగవరపుకోట: ఓం నమఃశివాయ..హరహర మహాదేవ..శంభో శంకర అంటూ భక్తజనుల శివనామస్మరణతో పుణ్యగిరి సానువులు పులకించాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో పుణ్యగిరి దారులు కిక్కిరిసాయి. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పావనక్షేత్రంలో కొలువుదీరిన ఉమాకోటిలింగేశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. పుట్టుదార, పార్వతీదార, దారగంగమ్మ లోయల్లో భక్తులు పవిత్ర స్నానాలు చేశారు. పలువురు పితృదేవతలకు అపరకర్మలు చేసి, పిండప్రదాన క్రతువులు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణచక్రవర్తి, స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ధారగంగమ్మ, సన్యాసేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ సింహాద్రినాయుడు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు పుణ్యగిరి, సన్యాసయ్యపాలెం దేవాలయాల దర్శనాలకు ప్రత్యేక బస్‌లు నడుపుతున్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలిక చలివేంద్రాలు, మరుగుదొడ్లు, స్నానాల గదులు, ప్రధాన వీధుల్లో విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు. కొట్టాం పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.


పూజలందుకుంటున్న ఉమాకోటిలింగేశ్వరుడు

సందడిగా కృష్ణమ్మతల్లి తీర్థం


పోటీలో పరుగుతీస్తున్న ఎడ్ల బండ్లు

బొండపల్లి: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో కృష్ణమ్మతల్లి పేరంటాలు తీర్థం శనివారం సందడిగా జరిగింది. మాజీ వైస్ ఎంపీపీ బొద్దు రాము, సత్యవతి దంపతుల ఆధ్వర్యంలో ఏటా మహాశివరాత్రి సందర్భంగా ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా జిల్లా స్థాయి సంగిడీలు, గుర్రపు పందాలు, ఎడ్ల బండ్ల పోటీలు, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. అలాగే కోలాటం, తప్పెడగుళ్లు, రేలారేలారే జానపద పాటలు, సత్యహరిశ్చంద్ర నాటకం, జబర్దస్త్ నటుల వినోద కార్యక్రమం, ఢీజోడీ నృత్య ప్రదర్శన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, లోక్‌సత్తా నాయకులు భీశెట్టి బాబ్జీ బహుమతులు అందజేశారు.


కోలాటం ఆడుతున్న మహిళలు

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం

జామి: మండలంలోని తాండ్రంగి గ్రామంలో శనివారం గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి తీర్థం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమతో పూజలు చేశారు. తీర్థం సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బండ్ల పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొదటి బహుమతి వల్లంపూడికి చెందిన ఏరువాక సత్తిబాబు, రెండో బహుమతి సిద్ధి వినాయక, తృతీయ బహుమతి నరసాపురానికి చెందిన సంపత్‌వినాయక గెలుచుకున్నారు.

ధ్యానంతోనే ప్రశాంత జీవనం


పట్టణంలో శాంతియాత్ర చేస్తున్న బ్రహ్మకుమారీలు

చీపురుపల్లి రూరల్: రాజయోగ ధ్యానంతో ప్రశాంత జీవనం సాధ్యమవుతుందని బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రం ఇన్‌చార్జ్ బీకే శాంతి అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో శనివారం శాంతియాత్ర, చైతన్యదేవి తిరువీధి కార్యక్రమాన్ని నిర్వహించారు. చీపురుపల్లి-పాలకొండ ప్రధాన రహదారి, లావేరు ప్రధాన రహదారిలో యాత్ర సాగింది. ఈ సందర్భంగా బీకే శాంతి మాట్లాడుతూ సర్వాత్మల తండ్రి పరమాత్మ భూమి మీద అవతరించిన గుర్తుగానే శివరాత్రి పర్వదినాన్ని జరుపుకుంటారన్నారు. ప్రస్తుత కాలంలో మనిషిని వేధిస్తున్న మానసిక రుగ్మతలు, ఒత్తిడి, అశాంతి అనేవి రాజయోగ మెడిటేషన్‌తో దూరమవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ రాజయోగ ధ్యానాన్ని సాధన చేసి జీవితాన్ని ప్రశాంతంగా మార్చుకోవాలని కోరారు.

టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన


టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న మహేశ్వరరావు, తదితరులు

శృంగవరపుకోట: భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్.ఎస్.యు.ఐ) ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌కే కోచింగ్ సెంటర్‌లో పదో తరగతి విద్యార్థులకు శనివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు సుమారు 529 మంది విద్యార్థులు హాజరయ్యారు. వాగ్దేవి విద్యాసంస్థల అధినేత కె.మహేశ్వరరావు, పి.మణిబాబు, రామకృష్ణ, ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర కార్యదర్శి కె.సన్యాసిపాత్రుడు ప్రశ్న పత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టి మంచి మార్కులు సాధించేందుకు ఇటువంటి పరీక్షలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు తన సొంత ఖర్చులతో కోరుకున్న కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదువులు చదివిస్తానని మహేశ్వరరావు అన్నారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ


చిన్నారికి దుస్తులు అందజేస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు శివ, తదితరులు

కొత్తవలస: దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, వారికి చేసిన సేవ దైవ సేవ కన్నా గొప్పదని సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కనకాల శివ అన్నారు. మండల కేంద్రంలోని చైతన్య మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఉన్న 40 మంది చిన్నారులకు బెంగుళూరుకు చెందిన విజయలక్ష్మి, సునీత, తనుజ ఆర్థిక సాయంతో సమకూర్చిన దుస్తులు, భోజనం, పండ్లు, చాకెట్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు శివ మాట్లాడుతూ మానసిక దివ్యాంగులకు ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరూ చేయూతనందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బోజింకి సన్యాసిరావు, ట్రస్ట్ సభ్యులు మీసాల దుర్గాప్రసాద్, వై.దుర్గాప్రసాద్, బంగారు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపైనే లారీల పార్కింగ్!


అరకు-విశాఖ రోడ్డులో జిందాల్ కర్మాగారం వద్ద రోడ్డుపై నిలిపిన లారీలు

కొత్తవలస: మండలంలోని పలు కర్మాగారాలకు రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలను రోడ్డుపై నిలుపుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నెలలోనే రెండు ప్రమాదాలు జరిగాయి. అందులో ఒకరు మృతి చెందగా.. 8మంది గాయపడ్డారు. ఈ నెల 9న వేకువజామున అరకు నుంచి సింహాచలం వెళ్తున్న ఆటో అప్పన్నపాలెం వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న జిందాల్ కర్మాగారానికి చెందిన లారీలను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. ఒక చిన్నారితో సహా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే విజయగనరం రోడ్డులో కంటకాపల్లి సమీపంలో శారద కర్మాగారం వద్ద, విశాఖపట్నం రోడ్డులో తాడివానిపాలెం కాటా వద్ద రోడ్డుపైనే లారీలను పార్కింగ్ చేస్తున్నారు. తెల్లవారుజామున పొగమంచు కారణంగా ఆయా వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.